# ఎక్స్ట్రా పాత్ర



***ఇది... పుట్టమీద వాలిన కాకి!***

***ఇదీ... ఊ... ద్రాక్షపళ్ళకోసం మూతి చాచిన నక్క!***

***మెడ కొంచెం ఇలావంచితే... బతకమ్మ మీద పేర్చిన గుమ్మడిపూల గుత్తి!***

***ఊ... ఇప్పుడేమో-***

***ఒహ్హో! పవర్ కట్- ఫ్చ్!***

***కొవ్వొత్తి వెలిగిస్తే గోడమీది నీడలు ఊగుతూ విచిత్రంగా- వింతగా- భయంకరంగా!***

***అయినా సరే! చూడాలి, చూడాలి! కళ్ళు మంటలెత్తేవరకూ, నిద్ర ముంచుకొచ్చేంతవరకూ- ముంచెత్తిన నిద్రలో కలలు కొట్టుకుపోయేంతవరకూ!***

"రాధా! రాధా!"

పొద్దు పోయి వచ్చినాయనెవరో తలుపు కొడుతూ పిలుస్తున్నాడు భార్యని! తనెవరు పిలుస్తారు? తన తలుపెవరు కొడతారు? వేళకాని వేళ పొరపాటున వాకిట్లోకి వెళ్ళినా- ఒక చీదరింపును కళ్ళతోనే చీది చివాలున తలుపేసుకోరూ! ఎవ్వరికీ కనిపించని విద్య తనకేదైనా వస్తే బావుండు!

ఉఫ్! హబ్బ! కొవ్వొత్తి ఊదేస్తే ఎంత హాయిగా ఉందీ చీకటి! చీకటీ! చీకటీ, చీదరింపు లేకుండా నన్ను కౌగలించుకున్న నువ్వెవరు? నా కన్నతల్లివా?

పేకాట్లో డబ్బు పోయిన కసినీ, తాగినమందు కిక్కివ్వని కసినీ వాళ్ళాయన తనపై తీర్చుకున్నాక, నాకన్నతల్లి దుఃఖాన్ని చిలకలు చుట్టుకు నములుతూ, ఆత్మహత్య ఊహ ఊబిలా లాగేస్తుంటే, మునగనివ్వని ఆధారాలుగా బిడ్డల్ని కౌగించుకుని మావళ్ళంతా అలుముకుని నిభాయించుకున్న తల్లి- డాక్టర్లెవ్వరికీ అంతుబట్టని కడుపునొప్పిని కడుపుతీపితో జయించి బతుకులాగుతున్న తల్లి-

తెల్లారాక చెంగుచాటున దాచుకున్న దెబ్బల్ని వెతికిపట్టుకుని పసి ఉక్రోషంతో "ఛీ! ఈ నాన్న చచ్చిపోతే బావుండన్నపుడు" పంచదార కొచ్చిన పక్కింటావిడ విన్నదన్న కోపంతో చెంప పగల గొట్టి, మాటనెలా పూడ్చిపెట్టుకోవాలో నేర్పి, ఈ పుట్టకు పుడిసెడు మట్టి తొలి దానమిచ్చిన కన్నతల్లీ!

నన్ను నేను తవ్వుకోవడం నేర్చుకుంది నీదగ్గరేకదా!

పూడ్చి పెట్టుకునేదాన్నేకదా బొంద అని అంటారు! అందుకేనా నేను పుట్టగానే 'ఆడబొంద' అన్నది?

ఆశల్నీ, కలల్నీ, నవ్వుల్నీ, పరుగుల్నీ పూడ్చుకుని సరసరా పాకుతున్న చదువును సగానికి తుంచితే ఒర్చుకుని, ఉన్న మార్కుల్లో చిన్న ఉద్యోగంలో ఇరుక్కుని, ఇరుకెంత సుఖమో అని ఇరుగుపొరుగుల ముందు భుజాలు చరుచుకుని, సంపాదనవరురాలు కనుక సగంకట్నానికే ఒప్పుకుంటున్నామంటే- అబ్బో గొప్ప అదృష్టమని ఏమార్చుకుని... మార్చుకొని- తీర్చుకుని- పూడ్చుకొని...ఈ దిగుళ్ళ లోయనీ, పగుళ్ళ గుండెనీ మాట్లు వేసుకునేందుకు చిటికెడు ప్రేమ కోసం దోసిలి పట్టిన చోట...

నీ జీతం చూసే నిన్ను చేసుకున్నదని కరెన్సీ నవ్వు కరకరమంటే...

ఏ జీవన నిబద్ధతాలేని సాహచర్యంలో, తనకెన్ని శరీరాల రుచులు తెలుసో గొప్పలు చెప్పే అతనితో- కంటికి కనిపించిన వాళ్ళనల్లా పచ్చిగా వర్ణించే అతనితో- దాంపత్యమంటే ఒక పర్మినెంట్ అడ్రస్... పైగా సంపాదించుకు వచ్చీ, సర్వసదుపాయాలూ కూర్చగల సమర్థతగల రిస్క్‌లెస్ అకౌంట్‌గా... అడ్డంగా పెత్తనం చెలాయించి బతకనేర్చిన అతనితో- ఏ ఫిగరూ దొరకనపుడు జరిగే అర్థరాత్రి ఆక్రమణల కలత నిద్ర తెల్లారాక- దిండు కింది సూత్రం గొలును వేసుకునేప్పుడు- ఎయిడ్స్ భయం మిన్నాగులా పీకపట్టుకుంటే... నాకీ మొగుడొద్దని పుట్టింటికి పరుగెత్తుకువస్తే....

కనుచూపుమేరా కనిపించని అగాధాలు చూపి జడిపిస్తావా అమ్మా! మొగుణ్ణొదిలేసి కుక్కలు చింపిన విస్తరయిన పాత సామెతల కథలు చెబుతావా? మొగుళ్ళే చేసే పకడ్బందీ హత్యల మాటేమిటి?

**పాటిబండ్ల రజని**

మొగుణ్ణొదిలేసిన, హైకోర్టు ప్లీడరుకే రక్షణలేదని భయపెడతావా? విలాసాల కోసం భార్యని వ్యభిచారులుగా మార్చే మొగుళ్ళ నుంచి రక్షణేది?

పుట్టింటి పరువుకోసమైనా ఒర్చుకోమంటావా!

పరువు ఎయిడ్స్‌కంటే భయంకరమైనదికాదు కదా!

వద్దమ్మా! వద్దు! నేను పారిపోతాను! నా జీవితానందం కోసం లోక న్యాయాన్ని ధిక్కరిస్తాను! ప్రేమ దొరికే నీడ కోసం ఎన్ని వడగాల్పులనైనా సహిస్తాను!

అవును! అవును! అవును!

కానీ... కానీ... కానీ... ఎక్కడ? నా ప్రేమికుడేడి? పెళ్ళాం ఉరేసుకు చని పోయిన నెలరోజులకే రెండో పెళ్ళి శుభలేఖ అందిస్తూ చెయ్యి నొక్కిన చెంగల్రావా?

ప్రేమించి పెళ్ళాడిన భార్య పురుటికెళ్ళిన పదిరోజులకే డిస్కషనుంది ఇంటికి రమ్మని చెయ్యి పట్టుకుని చెప్పుదెబ్బలు తిని ఇంక్రిమెంట్లాపి, ఇరకాటాల్లో పెట్టిన ఆఫీసరానందవా?

కాలేజీ రోజుల్నుంచీ నువ్వంటే పిచ్చి. మా ఆవిడకు తెలియకుండా నీకోసం ఏదైనా చేస్తానన్న కామేశవా?

ఆఫీసులోని ఆడవాళ్ళందరితో తనెక్కడెక్కడ ఎలా ఎఫైర్ నడిపాడో కథలు కథలుగా స్కాండల్స్ ప్రచారం చేసే సైకిక్ సైదాచారా?

అంకెలతో ఆడవాళ్ళను కొలిచే అంగ మాత్రులే తప్ప, "నా గాయాల్ని మరిపించి, అంతరంగ అగాధాన్ని స్పృశించి- నా లోపాల్ని సహించి, నా దుఃఖాన్ని వెలిగించి- యుగాంతం వరకూ ఉప్పొంగాలన్న జీవన కాంక్షను రేకెత్తించే ప్రేమికుడెక్కడ?" మూణ్ణిముషాల సరదా తీర్చుకునేవాడు తప్ప సహజీవన సౌందర్య దర్శనం చేయగల ధైర్యమున్న వాడెక్కడ?

చలం! చలం! ఈ నిర్జీవ పాత్రల్లో, ఈ కోర్కెల మూసల్లో జీవజలం నింపేందుకు మళ్ళీ పుట్టవా చలం!

ఇప్పుడు పురుషులకు శరీరం మాత్రమే ఉంది- దాన్లో కొంచం హృదయాన్ని నింపాలి!

మేధస్సు మాత్రమే ఉంది- కొంచం మమతనద్దాలి!

కామం చాలా ఉంది- కొండంత ప్రేమ నింపాలి!

వస్తావా చలం!

అందాకా మరేది దారి?

అందుకే... పిల్లల కోసమో- పరువు కోసమో- అమ్మకోసమో- మంచి ఇల్లాలన్న పేరు మీద లౌల్యంతోనో, పేరంటాల పిలుపుల బంధువర్గ మర్యాదల కీర్తికిరీటాల మోహంతోనో అలాగే అతనితోనే రోజులలా పళ్ళబిగువున సాగ్గొదుతుంటే...

ఇదేవిట్రా దేవుడా? మెడమీద ఈ చిన్నిచిన్ని కాయలు... చిన్నప్పుడు సరదాగా అంటించుకున్న బంక నక్కేరు కాయల్లా... బలమైన ఎరువువేసి పెంచుతున్నట్టు రోజురోజుకు గుత్తులు గుత్తులుగా పెరిగిపోతూ-

డాక్టర్... డాక్టర్... ఏమిటిది?

అల్లోపతిలో... మెటాస్ట్యాలోస్ఫై బ్రోసిస్!

ఆయుర్వేదంలో... దుర్మాంస ఖండ ఎదుగుదల!

హోమియోపతిలో... ఎక్స్ట్రా వార్టీ

గ్రోత్స్!

కట్టుకున్న పతిలో... చిందులు తొక్కే అసహ్యం!

ఏదో ఒక మందివ్వండి... ఈ పుట్టల్ని తొలిచేయండి... ఈ గుత్తుల్ని కోసెయ్యండి! కుదరదంటే కుదరదా! నరాల నుంచీ పుట్టిన వీటిని కత్తిరించే వీలులేదా? అల్లోపతిలో మందులే లేవా? అయితే హోమియోపతీ ట్రై చేస్తా!

నువ్వేమంటావు హానిమన్! అడ్డెడ్డే! నాలో డొల్లనంతా- తరతరాల గుట్టంతా పట్టేసావే?

ఏళ్ళతరబడీ బలవంతాన అణుచుకున్న భావపరంపరల ప్రతి రూపమా ఇది! ఇకనుంచైనా ఏ భావమూ అణుచుకోకుంటా బైటికి చెప్పేయాలా! చాల్లే ఊర్కో! ఒకసారెప్పుడో 'కూరేవిటిలా చప్పగా ఉందీ' అంటే నోరుజారి 'నిన్నటి రాత్రిలాగా!' అన్నందుకు అడ్డమైన సంబంధాలూ అంటగట్టి- రహస్యంగా ఓజోమన్‌లూ- వీటాఎక్స్‌లూ మింగాడే! అయినా ఆడవాళ్ళు మనసులో దాచుకున్నవన్నీ అనేస్తే... ఎంతమంది మగాళ్ళు మహదేవపురం మఠాలు పట్టాలీ?

ఇంతకీ అట్టా దాచుకున్నందుకేనన్నమాట మాకీ గర్భసంచుల్లో కణుతులూ- రొమ్ముల్లో గడ్డలూ- అమ్మ కడుపునొప్పి నాన్నపోయాకే ఎందుకు తగ్గిందీ ఇప్పుడర్థమైంది! వర్లక్ష్మత్త మూర్ఛరోగమూ అంతేగా! ఏదేవైనా ఉన్నమాట అనెయ్యడం కుదరదుగాని ఇంకో ఉపాయం చూడండి డాక్టర్!

"నా ప్రమేయం లేకుండా- నన్నాక్రమించుకుంటూ- నాతో సేవలు చేయించుకుంటూ- నాకే ఉపయోగమూలేకుండా- పోనీ వదిలించుకోవడానికి వీలుపడకుండా".... అచ్చం ఇలాంటి పోలిక గలదే జీవితంలో ఎక్కడో ఉన్నట్లుందే? ఏమిటబ్బా అదీ?

నో సోడ్స్ వాడాలి... ట్యూబర్క్యులం... తూజా....కోనియం... పొటెన్సీలు మార్చి చూడాలి... వేచివేచి ఉండాలి!

సరేసరే! తీపితీపి మాత్రలు మింగుతున్నా ఈ గుత్తులిలాగే పెరిగిపోతున్నాయే! ఒకటి ద్రాక్ష గుత్తిలా (ద్రాక్షావల్లి... అందమైన ఆ పేరు మీది మోహమిలా తీరిందా?) ఒకటి మేక మెడ చన్నులా, ఒకటి కందిరీగ గూడులా- దవడకిందా, చెవివెనుకా, మెడ మొత్తం... అబ్బా వదుల్చుకోలేని అసహ్యం!

"నా ప్రమేయం లేకుండా- నన్నాక్రమించుకుంటూ - నాతో సేవలు చేయించుకుంటూ- నాకే ఉపయోగమూలేకుండా- పోనీ వదిలించుకోవడానికి వీలుపడకుండా" .... అచ్చం ఇలాంటి పోలిక గలదే జీవితంలో ఎక్కడో ఉన్నట్లుందే? ఏమిటబ్బా అదీ?

నాకీ ఉపయోగం లేకుండా... నాతో సేవలు చేయించుకుంటూ... నామీద పెత్తనం చెలాయిస్తూ- వదుల్చుకోవడానికి వీలవ్వకుండా... హ్రే! మొగుడు! అచ్చు ఇది మొగుడి టైపే!

ఏవండి ఇదీ మీలాంటిదే!

అనకముందే అలా గుడ్లు మిటకరిస్తాడే?

నన్నిక ముట్టుకోడట! ఎంత చల్లని మాట.

నన్ను కట్టుకోవటం నీ ఖర్మా? నేనే ముందుగా ఈ మాట అనేసి ఉంటే కనీసం ఒక గ్రోత్ అయినా తగ్గేదికదా!

కోర్టుకెళ్తే సానుభూతితో విడాకులు మంజూరు చేస్తారా? ఎందుకు పాపం. వాళ్ళ విలువైన కాలం వృధా? నేనే సంతకం చేసేస్తానిటివ్వు! భరణమేమీ ఇవ్వవా? నీ దగ్గరేముంది ఎస్టీడీలు తప్ప? నువ్విటురాకుండా ఉంటే అదే పది లక్షలాబాబూ!

హమ్మయ్యా! వదిలావా?

అబ్బా? నీ గోలేంటే అమ్మా! "ఎక్కడ దాపరించిందే నీకీ మాయదారి రోగమంటావేంటే పిచ్చితల్లీ" మాయదారి రోగంకాదే ఇది దారి చూపిన రోగం!

'దారిచూపిన రోగమా- నను వీడి నువ్వు పోకుమా!'

ఛీ! మరీ దొంగ మొగుళ్ళు పాడే పాట! ఇదొద్దు! పాపులర్ టీ.వీ పాటేదైనా పాడదాం! పవిత్ర బంధం... పవిత్ర...? ఈ ప్రపంచంలో ఎన్ని పవిత్ర బంధాలున్నాయి? సగంపైగా పవిత్ర బొందలే! హహ్హహ్హా!

"మమ్మీ నువ్వు మా ఫ్రెండ్స్ ముందుకు రాకు, మమ్మల్ని వెక్కిరిస్తారు" పిల్లకాయల ఆర్డర్!

"అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం!"

ఒహ్హో! కరెంట్ వచ్చింది!

అరె! ఇప్పుడీ నీడ జెండాలాగా ఉందేంటి?

జెండా స్వాతంత్ర్యానికి గుర్తుగదా!

అవును! తనిప్పుడు అర్థరాత్రి ఒంటరిగా రోడ్డుమీద నడవగలదు! తనను చూసి జడుసుకునేవాడు తప్ప అల్లరిపెట్టేవాడుండడు!

సో... సంక్షేమరాజ్యం ఇవ్వలేని భరోసా ఇచ్చిన ఈ ఎక్స్ట్రా గ్రోత్‌ని మించిన గొప్ప జెండా ఉందా? ఎక్స్ట్రా గ్రోత్‌కీ జై!

జెండా కింది.... ఆ గుత్తి... ఆ! మంగళసూత్రం బిళ్ళల్లా ఉన్నాయి! ఏ మొగుడూ ఇవ్వలేని రక్షణ నిచ్చింది కదా! ఇక తన్నెవ్వడూ కన్నెత్తి చూడడు! కన్నుగీటడు! కాలుతొక్కడు! డిస్కషనుంది రమ్మనడు- ఎఫైరుందని కొయ్యడు!

వ్వాటే ఆపర్చునిటీ! మంగళమనరె వనితలార జయమంగళమనరె ఎక్స్ట్రా గ్రోత్‌కిప్పుడూ సర్వమంగళం!

హో ఆవ్!

అమ్మో! నిద్దరొస్తుంది! నిద్రపోవాలంటే భయం!

కలలో ఎవరో ఒకతను తనను ప్రేమిస్తున్నట్లూ, లాలిస్తున్నట్లూ, కమ్మగా, ఆర్తిగా కౌగలించుకుని నుదుటిన ముద్దిడుతున్నట్లూ; ఒకటే ఆశల అలలు!

ఛీఛీ! ఈ ఫారిన్ ఫైబర్ దిండు బొత్తిగా తడి పీల్చట్లేదు! రేపు జీవితకాలపు కన్నీళ్ళు పీల్చుకోగల మేడిన్ ఇండియా దిండుకొనాలి! •



## సంతోషం సగంబలం

మనిషికి సంతోషం అనేది సగం బలాన్ని తెచ్చిపెడుతుందనటంలో ఎలాంటి సందేహంలేదు. మనిషంటేనే సమస్యల గూడు. మనిషి జీవితంలో అడుగడుగునా ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొంటూ మనుగడ సాగించవలసి వస్తుంది. అటువంటప్పుడు సమస్య చిన్నదైనా, పెద్దదైనా నీరుగారిపోకుండా ధైర్యంగా ఎదుర్కోవాలి. అలాంటప్పుడే కష్టాలు అన్నీ పారిపోయి సంతోషం, ఆనందం మనకు దక్కుతుంది. ఇన్నిరకాల బాధలున్నప్పుడు సంతోషంగా ఎలా ఉండగలమంటారా? తప్పకుండా ఉండగలమండి. అది ఎలాగంటారా?

* ఎటువంటి సమస్య ఎదురైనా భయపడకుండా మనోనిబ్బరంతో సాధించటానికి ప్రయత్నించాలి.

*సమస్యని సమస్యగా చూడకుండా ఛాలెంజ్‌గా తీసుకోవాలి. కొన్ని జటిలమైన సమస్యలు వస్తుంటాయి. అలాంటప్పుడు తెలివిగా పరిష్కరించుకోవాలి. అవసరమైతే కావలసినవాళ్ళ సహాయం పొందాలి.

* చిన్నచిన్న ఇబ్బందులను భూతద్దంలో చూడకుండా ఎంత సులువుగా సాధించగలమో తెలుసుకొని సాధించాలి.

* సాధ్యమైనంత వరకు సమస్యలు రాకుండా జాగ్రత్తపడాలి.

* ప్రతి చిన్న విషయానికి విపరీతంగా ఆలోచించడం మంచిదికాదు. మనకవసరంలేనివాటిని వదిలేయాలి.

* ఎప్పుడూ మంచి ఆలోచనలతో గడపాలి. మన వల్ల ఎవరికీ హాని కలగకుండా చూసుకోవాలి.

* ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ బాధపడటం వల్ల ఎన్నోరకాల మానసిక జబ్బులను కొని తెచ్చుకోకుండా ప్రశాంతంగా ఉండటానికి ప్రయత్నించాలి. మెడిటేషన్ వల్ల మంచి ఉపయోగం ఉంటుంది.

* సంతోషం అనేది మనిషి మనసుకి టానిక్‌లాంటిది. మనసు బాగుంటే శరీరంలోని ఇతర అవయవాలన్నీ చక్కగా పనిచేస్తాయి. శరీరంపై ఎలాంటి వత్తిడి ఉండదు. మనం హాయిగా, ఆనందంగా బతకాలంటే ఉన్నదాంట్లో సంతోషంగా బతకటం నేర్చుకోవాలి. సంతోషాన్ని మనకు దేవుడిచ్చిన వరంగా భావించి అపురూపంగా అనుభవించి ఆనందాన్ని పదిమందికి పంచాలి. ఆనందంగా జీవించాలి. మనిషికి ఆహారం ఎంత అవసరమో మనసుకు ఆనందం అంతే అవసరమని గమనించాలి.

– జవేరియా